సాక్షి కామారెడ్డి

సోమవారం ౹ 22 ౹ జనవరి ౹ 2024



తాత్కాలిక భవనాల్లోనే..

కొత్త మండలాలలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో తాత్కాలిక భవనాల్లోనే కొనసాగుతున్నాయి.

- 9లో ▸



ప్రయోగం.. ప్రహసనం

ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రాక్టికల్స్ ప్రహసనంగా మారాయి.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.8 /18.3

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

త్వరలో జేఎల్‌ఎం పోస్టుల నాలుగో విడత జాబితా

నిజామాబాద్ నాగారం: విద్యుత్ శాఖ పరిధిలో గతంలో నిర్వహించిన జూనియర్ లైన్‌మెన్ పోస్టులకు సంబంధించి నాలుగో విడత జాబితాను త్వరలో విడుదల చేయనున్నారు. ఇందుకు సంబంధించిన జీవో కాపీని విద్యుత్ శాఖ ఎస్ఈ రవీందర్‌కు సీఎండీ కార్యాలయం నుంచి మెయిల్ ద్వారా పంపించారు. 2018 సంవత్సరానికి ముందు జేఎల్ఎంల రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి మొదటి మూడు విడతల్లో అభ్యర్థులకు మెరిట్ ఆధారంగా స్తంభం పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి ఉద్యోగాలిచ్చారు. తాజాగా నాలుగో విడత జాబితాను విడుదల చేయనున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో నిరుద్యోగ జేఎల్ఎం పరీక్ష రాసిన అభ్యర్థుల లిస్టును మెరిట్ ఆధారంగా సిద్ధం చేయనున్నారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు ఈనెల 29న వెలువడినట్లు తెలిసింది.

'గడువులోగా సీఎంఆర్ పూర్తి చేయాలి'



మాచారెడ్డి: పెండింగ్‌లో ఉన్న 2022–23 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన కస్టం మిల్లింగ్ రైస్‌ను ఈనెలాఖరులోగా ఎఫ్‌సీఐకి అప్పగించాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ రైస్‌మిల్లర్లను ఆదేశించారు. ఆదివారం ఆయన పాల్వంచ మండల కేంద్రంలోని రేణుక మాడ్రన్ రైస్‌మిల్లును తనఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యాన్ని చేరుకునేందుకు నిరంతరాయంగా మిల్లును నడిపించాలన్నారు. టార్గెట్ పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఖరీఫ్ సీజన్ ముగిసి ఏడాది గడిచినా రైస్‌మిల్లర్లు ఇప్పటికీ కస్టం మిల్లింగ్ రైస్‌ను అప్పగించకపోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. ఈనెలాఖరులోగా బియ్యం పంపించని మిల్లుల యజమానులపై ఆర్ఆర్ యాక్ట్ కింద చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు పెడతామన్నారు. మిల్లర్లు అలసత్వం వీడి లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

'క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేస్తాం'



పిట్లం: అన్ని ఆటలు ఆడుకునేందుకు వీలుగా క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పిట్లంలోని వివేకానంద పాఠశాలలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పిట్లం వైఎస్ఆర్ జట్టుపై బిచ్కుంద ఎల్‌కేఆర్ జట్టు గెలిచింది. ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే ట్రోఫీ అందించారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకుడు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ సర్పంచ్ గంగారాం, నాయకులు బోడ్లరాజు, షేక్ నజీర్, శివ, రాజు రాథోడ్, అద్నాన్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అపురూపఘట్టం.. ఆవిష్కృతమవుతున్న వేళ..



కామారెడ్డి: రామాంజనేయుల వేషధారణలో..

- అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ వేళ జిల్లాలోనూ ప్రత్యేక కార్యక్రమాలు
- ఆలయాలను ముస్తాబు చేసిన భక్తులు
- ప్రత్యక్ష ప్రసారాన్ని సామూహికంగా వీక్షించడానికి ఏర్పాట్లు
- జిల్లా అంతటా పండుగ వాతావరణం


సాక్షి, కామారెడ్డి: రామ జన్మభూమిలో అపురూప ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. అయోధ్యలో బాలరాముడు కొలువుదీరబోతున్నాడు. సోమవారం అయోధ్యలో కౌసల్యా నందనుడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో జిల్లాలోనూ పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి ఇంటా దీపావళి పర్వదినాన్ని జరుపుకోవడానికి భక్తకోటి సన్నద్ధమైంది. వాడవాడలా ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. అయోధ్యాపురిలో ప్రభు శ్రీరామచంద్రుడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆ దృశ్యాన్ని ప్రసార మాధ్యమాల ద్వారా తిలకించడానికి వాడవాడలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇదే సమయంలో జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న రామాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించి, వేడుకలకు ముస్తాబు చేశారు. ప్రత్యేక పూజలు, పుష్పార్చనలు చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. జిల్లాకేంద్రంతోపాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణాలు, పలు గ్రామాలలో ప్రత్యేక పూజలు, భజనలు, శోభాయాత్రలు నిర్వహించనున్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో సోమవారం కామారెడ్డి పట్టణంలో వ్యాపార, వాణిజ్య సంస్థలను మూసి ఉంచాలని చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్ణయించింది. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆహ్వానం అందుకున్న బిచ్కుందకు చెందిన బండాయప్ప మఠం పీఠాధిపతి సోమాయప్ప స్వామీజీ ఇప్పటికే అయోధ్యకు చేరుకున్నారు. పలువురు భక్తులు, కరసేవకులు కూడా తరలివెళ్లారు.

పండుగ సందడి

అయోధ్యనుంచి వచ్చిన రామ పూజిత అక్షింతలు ఇప్పటికే ఇంటింటికీ చేరాయి. వాటిని భక్తులు అపురూపంగా భావిస్తూ పూజా మందిరంలో భద్రపరచుకున్నారు. సోమవారం అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠాపనను పండుగగా జరుపుకునేందుకు ఇళ్లను శుభ్రం చేసుకుని, తోరణాలు కట్టారు. చాలా మంది తమ ఇళ్లపై శ్రీరాముని చిత్రాలతో ముద్రించిన జెండాలను కట్టారు. ప్రధాన కూడళ్లు, ఆలయాలు కాషాయమయమయ్యాయి. ప్రాణ ప్రతిష్ఠను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించడానికి పలు ప్రాంతాలలో భారీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు.

ముస్తాబైన ఆలయాలు

జిల్లాలోని పలు గ్రామాలలోగల రామాలయాలు ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీ, అశోక్‌నగర్ కాలనీ, అడ్లూర్‌లలోగల రామాలయాలతో పాటు జిల్లావ్యాప్తంగా గల ఆలయాలను ముస్తాబు చేశారు. గతంలో శ్రీరామ నవమి రోజున ఆలయాలను ముస్తాబు చేసి పూజలు నిర్వహించేవారు. ఈసారి అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం అవుతున్న సందర్భంగా ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. కొన్నిచోట్ల అన్నదానం చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నారు.




మద్నూర్ బాలాజీ మందిరం వీధిలో విద్యుత్ దీపాలంకరణ

ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో హోమం

భిక్కనూరు: జంగంపల్లి గ్రామంలోని రంగనాయకుల గుట్టపై వెలసిన రామచంద్రమూర్తి శిలావిగ్రహం వద్ద ఆదివారం ఆర్యసమాజం ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా హోమం చేశారు. ఈ సందర్భంగా ఆచార్య నరేంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభు శ్రీరామచంద్రుడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రామరాజ్య స్థాపనకు అందరూ కంకణం కట్టుకోవాలని పిలుపునిచ్చారు.



జంగంపల్లిలో హోమంలో పాల్గొన్న భక్తులు



ఎల్లారెడ్డిలోని రామాలయం వద్ద ఏర్పాట్లు..



జిల్లా కేంద్రంలో ముస్తాబైన రామాలయం



భిక్కనూరులో ఏర్పాటు చేసిన హనుమాన్ విగ్రహం



ముస్తాబైన లింగాపూర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయం

పోస్టు లేకున్నా పోస్టింగ్!

- నాలుగేళ్లుగా అక్రమ డిప్యుటేషన్
- ఆఫీసుకు రాకున్నా వేతనం పొందుతున్న అధికారి
- వ్యవసాయ శాఖలో విచిత్రం



కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయం

సాక్షి, కామారెడ్డి: ఆ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో) పోస్టే లేదు. అయినా ఆన్ డ్యూటీ పేరుతో డిప్యుటేషన్‌పై వచ్చిన సదరు అధికారి నాలుగేళ్లుగా ఎలాంటి జాబ్ చార్ట్ లేకుండానే కొనసాగుతూ వేతనం పొందుతున్నారు. లేని పోస్టులో కొనసాగుతున్న సదరు అధికారికి చుట్టపు చూపులా అప్పుడప్పుడు వచ్చి సంతకాలు పెట్టుకుని వెళ్లడమే పని కావడం గమనార్హం. వివరాలిలా ఉన్నాయి. వ్యవసాయ శాఖలో పాత జిల్లాల్లోనే జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో) పోస్టు ఉంది. జిల్లాల విభజన తర్వాత కొత్త జిల్లాలకు జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో), సూపరింటెండెంట్ పోస్టులు మాత్రమే కేటాయించారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన అన్ని వ్యవహారాలను డీఏవో చూసుకుంటుండగా.. కార్యాలయ నిర్వహణ, సిబ్బందికి సంబంధించిన పనులను సూపరింటెండెంట్ చూసుకుంటున్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టు ఇప్పటికీ మంజూరు కాలేదు. కాగా లేని ఏవో పోస్టులోకి నాలుగేళ్ల క్రితం ఓ అధికారి డిప్యుటేషన్ మీద రావడం గమనార్హం. ఆన్ డ్యూటీ అంటూ వచ్చి చేరిన సదరు అధికారి వర్క్ చార్ట్ లేకుండానే ఉద్యోగంలో కొనసాగుతున్నారు. వాస్తవంగా సదరు అధికారికి మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయశాఖలో పోస్టింగ్ ఇచ్చారు. అక్కడే పనిచేయాల్సి ఉంది. అయితే తన కుటుంబం నిజామాబాద్‌లో ఉండడంతో మహబూబ్‌నగర్ వెళ్లకుండా డిప్యుటేషన్ కోసం ప్రయత్నించారు. నిజామాబాద్ జిల్లా వ్యవసాయ కార్యాలయంలో పోస్టు ఖాళీగా లేకపోవడంతో రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని వ్యవసాయ శాఖ కమిషనరేట్ అధికారుల ద్వారా డిప్యుటేషన్‌పై కామారెడ్డి వ్యవసాయ శాఖ కార్యాలయానికి వచ్చారు. లేని పోస్టులోకి డిప్యుటేషన్ అంటూ పంపడం ఏమిటని అప్పట్లో జిల్లాలో పనిచేసిన అధికారులు అభ్యంతరం చెప్పినా.. ఉన్నత స్థాయి అధికారుల ఒత్తిళ్లతో వెనక్కితగ్గి, ఆమెకు ఇక్కడ ఓ కుర్చీ కేటాయించారు. అయితే ఆ అధికారికి ఎలాంటి డ్యూటీలు ఉండవు. అప్పుడప్పుడు వచ్చి అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేసి వెళ్తారు. అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాల ఆధారంగా నెలనెలా అటెండెన్స్ సర్టిఫికెట్ తీసుకుని, మహబూబ్‌నగర్‌లో వేతనం పొందుతున్నారు. నాలుగేళ్లుగా లేని పోస్ట్‌లో కొనసాగుతూ, పని చేయకున్నా వేతనం పొందుతున్న ఆ అధికారి వ్యవహారంపై విస్మయం వ్యక్తమవుతోంది. దీనిపై జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) భాగ్యలక్ష్మి వివరణ కోరగా అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాల ఆధారంగా అటెండెన్స్ సర్టిఫికెట్లు ఇస్తున్నామని తెలిపారు. తాను జిల్లాకు రాకముందు నుంచి ఆమె ఉన్నారని, అప్పటిలాగే కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ఆఫీసు వ్యవహారాలన్నీ సూపరింటెండెంట్ చూసుకుంటారని తెలిపారు.

షబ్బీర్ అలీకి దక్కిన పదవి



షబ్బీర్ అలీకి శుభాకాంక్షలు తెలుపుతున్న చుక్కాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖల సలహాదారుగా నియామకం
- మాజీ మంత్రి అనుచరుల్లో ఆనందం

సాక్షి, కామారెడ్డి: ఎట్టకేలకు మాజీ మంత్రి షబ్బీర్ అలీ సీనియారిటీకి గుర్తింపు దక్కింది. ఆయనను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖల సలహాదారుగా నియమిస్తూ సర్కారు నిర్ణయం తీసుకుంది.

రాష్ట్రంలో సుమారు దశాబ్దకాలం తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే మాజీ మంత్రి, పీఏసీ చైర్మన్ షబ్బీర్ అలీ మొన్నటి ఎన్నికల్లో ఓటమి చెందడంతో కొంత నిరాశచెందారు. ఎమ్మెల్యేగా గెలుపొంది ఉంటే ప్రభుత్వంలో కీలకమైన పదవి దక్కేదని భావించారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితుడిగా గుర్తింపు ఉన్న షబ్బీర్ అలీ.. మైనారిటీ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం, తద్వారా మంత్రి పదవి వస్తుందని ఆశించారు. కానీ ఇటీవల ఎమ్మెల్యే కోటాకు సంబంధించిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం దక్కలేదు. దీంతో ఆయన అనుచరులు నిరుత్సాహానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం మేరకు షబ్బీర్ అలీని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా (బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖలు) నియమిస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఐదేళ్లుగా అధికార పదవి లేకుండా ఉన్న షబ్బీర్ అలీకి ఇప్పుడు ప్రభుత్వ సలహాదారు హోదా లభించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కాగా షబ్బీర్ అలీకి అధికారిక పదవి లభించడంతో కామారెడ్డి నియోజకవర్గంలో రాజకీయాలు మారనున్నాయి. స్థానికంగా అధికార పార్టీ ఆధిపత్యం కోసం ప్రయత్నించే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ నేతలు, శ్రేణులు యాక్టివ్ అయ్యారు. దీనికి తోడు షబ్బీర్‌కు సలహాదారు పదవి రావడంతో వారు మరింత క్రియాశీలకంగా వ్యవహరించే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

మాజీ మంత్రికి శుభాకాంక్షలు..

మాచారెడ్డి: ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన మాజీ మంత్రి షబ్బీర్ అలీని మండలంలోని చుక్కాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎల్లాగౌడ్, నేతలు సూర్యప్రకాష్, బాల్ నర్సు, బాల్‌కిషన్, నరేష్ గౌడ్, దేవరాజు, రమేష్ ఉన్నారు.

రాజకీయ నేపథ్యం..

1970లో ఎన్ఎస్‌యూఐలో కార్యకర్తగా షబ్బీర్ అలీ విద్యార్థి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. ఆ తర్వాత యూత్ కాంగ్రెస్ నేతగా క్రియాశీలక రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 1987 లో మాచారెడ్డి ఎంపీపీగా పోటీ చేసి ఓడిపోయారు. 1989లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారి కామారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి క్యాబినెట్‌లలో మంత్రిగా పనిచేశారు. కామారెడ్డి నియోజకవర్గంలో నాటి నుంచి నేటి దాకా మంత్రి పదవి పొందిన ఏకైక వ్యక్తి ఆయనే.. 1994, 1999 ఎన్నికల్లో షబ్బీర్‌అలీ ఓటమి చెందారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వచ్చిన షబ్బీర్ అలీ 2004 ఎన్నికల్లో గెలిచారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి క్యాబినెట్‌లో కీలకమైన విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేశారు. 2009 ఎన్నికలతో పాటు 2014, 2018 ఎన్నికల్లోనూ షబ్బీర్‌అలీ ఓటమి పాలయ్యారు. 2013లో శాసన మండలి సభ్యుడిగా నియమితులైన షబ్బీర్‌అలీ ఆరేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగారు. కొంతకాలం పాటు మండలి విపక్ష నేతగా పనిచేశారు. గతనెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు.

'అర్హులందరూ ఓటరుగా నమోదవ్వాలి'

తాడ్వాయి: అర్హులైనవారందరూ తప్పనిసరిగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఆదివారం ఆయన తాడ్వాయి, ఎర్రాపహాడ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను తనిఖీ చేశారు. ఓటరు నమోదు, మరణించిన ఓటర్ల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదుతో పాటు ఓటరు లిస్టులో అడ్రస్ మార్పిడి, పేర్లను సరిచేయడం కోసం కూడా దరఖాస్తులు తీసుకోవాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సునీత, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేష్, ఆర్ఐ లక్ష్మణ్, బూత్‌లెవల్ అధికారులు ఉన్నారు.



తాడ్వాయిలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

2,764 దరఖాస్తులు..

కామారెడ్డి క్రైం: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో ఓటరు నమోదు, సవరణలు, మార్పులు, చేర్పులకు సంబంధించి 2,764 దరఖాస్తులు వచ్చాయి. ఈ విషయాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోగల 791 పోలింగ్ బూత్‌లలో శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించామని పేర్కొన్నారు. కొత్త ఓటర్ల నమోదుకోసం ఫారం –6 ద్వారా 2,100 దరఖాస్తులు, ఫారం –7 ద్వారా చనిపోయిన ఓటర్ల తొలగింపులకు సంబంధించి 113 దరఖాస్తులు, ఫారం 8 ద్వారా మార్పులు, చేర్పులకు సంబంధించి 551 దరఖాస్తులు వచ్చాయని వివరించారు.

పక్కాగా నిర్వహించాలి



దరఖాస్తులను పరిశీలిస్తున్న మనుచౌదరి

నిజాంసాగర్: ఓటరు నమోదుతో మార్పులు, చేర్పుల ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ మనుచౌదరి సూచించారు. ఆదివారం ఆయన సుల్తాన్‌నగర్, బంజపల్లి గ్రామాలలో పర్యటించి, ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు. పంచాయతీలవారీగా వచ్చిన ఓటరు దరఖాస్తులను రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. మార్పులు, చేర్పుల దరఖాస్తులను భద్రపరచాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ భిక్షపతి, ఆర్ఐ అంజయ్య, పంచాయతీ కార్యదర్శి గంగారాం ఉన్నారు.

క్లుప్తంగా

ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో జిల్లా ఉపాధ్యాయుడు



కామారెడ్డి రూరల్: ఇండియా సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హర్యానాలో జనవరి 17 నుంచి 20 వరకు ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ జరిగింది. అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఉన్న పలువురు నిష్ణాతులై, విషయ పరిజ్ఞానం కలిగిన ఉపాధ్యాయులను పలుసార్లు పరీక్షించి ఆహ్వానం పంపింది. ఇందులో కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న విజయగిరి రామకృష్ణ ఎంపికై పాల్గొన్నారు. ప్రయోగాత్మక అభ్యసనాన్ని ప్రోత్సహించడానికి ఈ ఫెస్టివల్ ఉపయోగపడుతుందని రామకృష్ణ ఆదివారం తెలిపారు. ఈ విభాగంలో ప్రపంచంలోని 33 దేశాలకు చెందిన విద్యావేత్తలు పాల్గొన్నారు. రామకృష్ణను పలువురు అభినందించారు.

రావి ఆకుపై శ్రీరాముడు



బాన్సువాడ రూరల్: అయోధ్యలో బాలరాముని విగ్రహప్రతిష్ఠాపన, ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పోచారం తండాకు చెందిన మైక్రో ఆర్టిస్ట్ సరిచంద్, రావి ఆకుపై శ్రీరాముని మందిరం, శ్రీరాముడు, హనుమాన్ చిత్రాలను గీచి అబ్బుర పరిచాడు. గతంలో పెన్సిల్‌లెడ్, చాక్‌పీస్, సబ్బుబిల్లపై రకరకాలు చిత్రాలు గీసినట్లు కళాకారుడు సరిచంద్ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



నస్రుల్లాబాద్(బాన్సువాడ): కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలను వినియోగించుకోవాలని మండల బీజేపీ అధ్యక్షులు సున్నం సాయిలు అన్నారు. ఆదివారం వికసిత భారత్, సంకల్ప యాత్రలో భాగంగా నెమ్లిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి బ్యాంకు లోన్ సదుపాయాలను అందిస్తుందన్నారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి హన్మండ్లు, జిలా కార్యవర్గ సభ్యులు సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.


వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని మౌలాన్‌ఖేడ్, రేపల్లెవాడ గ్రామాలలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాల గురించి వివరించారు. గాయత్రి గ్యాస్ నిర్వాహకులు పండరి, ఎస్‌బీఐ సిబ్బంది, బీజేపీ నాయకులు ఎస్ఎన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇదేమి నీటి విడుదల..!

- వరదకాలువ ద్వారా మళ్లీ విడుదల
- రెండు రోజుల క్రితం నిలిపివేత
- ఇది వరకు మూడుసార్లు విడుదల
- అధికారుల తీరుపై రైతుల అసహనం



వరద కాలువ ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద కాలువ ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల తీరుపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి ప్రస్తుత సంవత్సరం యాసంగి సీజన్‌లో అధికారులు ఆయకట్టుకు నీటివిడుదలను చేపడుతున్నారు. గతంలో ఎప్పుడూ యాసంగిలో వరద కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టలేదు. కానీ ప్రస్తుత సంవత్సరం నూతన ఆయకట్టులో భాగంగా నీటి విడుదల చేపడుతున్నారు. ఈ నెల 6వ తేదీ నీటిని విడుదల చేశారు. 2 వేల క్యూసెక్కులు వదిలారు.

ఈ నెల 11న నీటి విడుదలను నిలిపివేశారు. మళ్లీ రెండు రోజులు గడవక ముందే 13వ తేదీ నుంచి నీటిని విడుదల చేపట్టారు. ఈ సారి 3 వేల క్యూసెక్కులు వదిలారు. ఈ నెల 18 వరకు నిరంతరం నీటి విడుదల చేపట్టారు. 18న సాయంత్రం నిలిపేశారు. మళ్లీ రెండు రోజులు గడవక ముందే శనివారం ప్రారంభించారు. ఈ సారి వరద కాలువ ద్వారా 5వేల క్యూసెక్కులు వదులుతున్నారు. నీటి విడుదల ప్రారంభం నుంచి నిలిపేసిన ప్రతిసారి రెండు రోజులు గడవక ముందే నీటిని మళ్లీ విడుదల చేస్తున్నారు. అంతే కాకుండా వదిలిన ప్రతిసారి నీటి విడుదలను పెంచుతూ వస్తున్నారు. ఇలా ఇష్టారీతిన వరద కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టడంపై ఆయకటుట రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాల్వల ద్వారా యాసంగి పంటలకు నీటివిడుదల కొనసాగుతుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం వేగంగా తగ్గుతోంది. ప్రాజెక్టు నుంచి వరద కాలువ ద్వారా 5వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 3500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 270 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 476 క్యూసెక్కులు, ముంపు ఎత్తిపోతల ద్వారా 312 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 354 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(90 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టులో 1081.80 అడుగుల(57.05 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



బినోలాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవీపేట: విద్య, వైద్య, సాగునీటి రంగాలకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని లింగాపూర్, నాళేశ్వర్, తుంగిని, నిజాంపూర్, బినోల, సిరన్‌పల్లి, జన్నెపల్లి, నారాయణ్‌పూర్ గ్రామాలలో ఆదివారం పర్యటించారు. బినోల శివారులో రూ. 70 లక్షల వ్యయంతో నిర్మించిన సొసైటీ భవనాన్ని ప్రారంభించి ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర ప్రభుత్వ భవన నిర్మాణాల పనులను తాత్కాలికంగా ఆపేసి, విద్యారంగ సదుపాయాలకు నిధులు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులను ఆదుకుంటున్న ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు అధికారులు కృషి చేయాలన్నారు. నాళేశ్వర్, యంచ ఎత్తిపోతల పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులతో పాటు సిబ్బంది పోస్టుల భర్తీకి త్వరలో చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో బెల్ట్‌షాపుల నిర్వహణపై ఎక్సైజ్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాహెర్, అంతిరెడ్డి రాజారెడ్డి, మానాల మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రకుమార్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, చల్లా రవీందర్, భానుచందర్‌గౌడ్, పోశెట్టి, బాబు, మూస, విజయ్, పెద్దన్న, రాజేశ్వర్, బినోల సొసైటీ డైరెక్టర్లు, సీఈవో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



బోధన్‌టౌన్: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకతీయ చేయూత చారిటబుల్ ట్రస్ట్, కమ్మ సంఘం సహకారంతో 56వ సీనియర్ ఖోఖో చాంపియన్ షిప్ పోటీలను పట్టణ శివారులోని కమ్మ సంఘంలో ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలను ఆర్డీవో రాజాగౌడ్ ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. వచ్చే ఏడాది ఖోఖో పోటీలను పట్టణంలో నిర్వహిస్తామన్నారు. అనంతరం గెలుపొందిన జట్లకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భూంరెడ్డి, కమ్మ సంఘం అధ్యక్షుడు శివన్నారాయణ, కాకతీయ చేయూత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికే ఆదర్శం జిల్లా క్రీడారంగం



క్రీడాకారులతో అధికారులు



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న నాయకులు

రెంజల్: క్రీడారంగంలో రాష్ట్రంలోనే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఆదర్శంగా నిలుస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. కనుమరుగవుతున్న గ్రామీణ క్రీడలను దాతలు ప్రోత్సహించడం అభినందనీయమని కొనియాడారు. రెంజల్ హైస్కూల్‌లో ఆదివారం గడ్డం జనార్దన్‌రెడ్డి మోమెరియల్ టోర్నమెంట్, జిల్లా జట్లకు క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక ఎంపీపీ లోలపు రజని, సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు శంకర్, ఎస్సై ఉదయ్‌కుమార్, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్యాం మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యంతో పాటు ప్రభుత్వ కొలువులను సాధించవచ్చని అన్నారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడలపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం క్రీడాకారులకు గడ్డం జనార్దన్‌రెడ్డి కుటుంబీకులు ప్రవంతి, సాత్విక్ క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆంజనేయులు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సోమలింగంగౌడ్, పీఈటీ కృష్ణ మూర్తి, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులు సంఘటితం కావాలి

- టీఎంకేఈడబ్ల్యూఏ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఏనుగుల సత్యనారాయణ

నిజామాబాద్ నాగారం : మున్నూరుకాపు సభ్యులందరినీ సంఘటిత పరుచుకొని సంక్షేమ కార్యక్రమాలు ప్రగతి బాట నడిపించేందుకు అందరూ కృషి చేయాలని మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఏనుగుల సత్యనారాయణ పేర్కొన్నారు. నగరంలోని న్యాల్‌కల్ పట్టణ మున్నూరు కాపు సంఘం ఫంక్షన్‌హాల్‌లో మున్నూ రు కాపు ప్రభుత్వ ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని అనంతరం మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక స్థాయి లో సంఖ్యాబలం ఉన్నది మున్నూరుకాపులదేనన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ధర్మపురి సురేందర్ పటేల్ మాట్లాడుతూ అత్యధిక మున్నూరు కాపు కళ్యాణ మండపాలు నిజామాబాద్‌లోనే ఉండటం గర్వించదగ్గ విషయమన్నారు. ఇది మున్నూరు కాపుల ఐక్యతకు నిదర్శనమన్నారు. మరో గౌరవ అతిథి బాల శ్రీనివాస్ పటేల్ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ఉద్యోగుల సంఘానికి పునాది ఏర్పడ్డప్పటికి మధ్యలోనే నిలిచిపోయిందని, మూడేళ్ల క్రితం మళ్లీ అందరినీ ఒక్కతాటిపైకి తెచ్చి ప్రస్తుతం 33 జిల్లాల్లో ప్రతిష్ఠాత్మకంగా నిలిచామన్నారు. ప్రస్తుతం మన సంఘంలో దాదాపు 55,000 మంది సభ్యులున్నారన్నారు. ప్రతి జిల్లాలో సభ్యత్వ నమోదుకు కొనసాగించి రాష్ట్రంలోని అతిపెద్ద సంఘంగా నిలిచేందుకు కృషి చేద్దామన్నారు. రాజకీయాలకు అతీతంగా మన సంఘం పనిచేస్తోందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తోటరాజశేఖర్ మాట్లాడుతూ అనతి కాలంలోనే ఈ సంఘాన్ని ఒక తాటిపైకి తీసుకువచ్చి జిల్లాలో సభ్యులను ఒకే మాట పైన నడిపిస్తూ సారథ్యం వహించడం జరిగిందని దీనికి రాష్ట్ర సంఘం తమను సహకారాన్ని అందించిందన్నారు. భవిష్యత్తులో డివిజన్ స్థాయి లో కమిటీలు త్వరలోనే వేస్తామని, బీద విద్యార్థులకు చేయూతనిచ్చి, పెళ్లి పందిరిని ప్రారంభించి అందరికీ అందుబాటులో నిలుస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి అబ్బాపూర్ మాట్లాడుతూ జిల్లా నివేదికను సమర్పించారు. అందరూ సభ్యత్వం తీసుకొని సంఘాన్ని ప్రతిష్ఠపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసం శ్రీనివాస్ పటేల్ సంయుక్త కార్యదర్శి ఆర్మూర్ శ్రావణ్ కుమార్ పటేల్, జిల్లా గౌరవ అధ్యక్షుడు బీ.ఆంజనేయులు పటేల్, ముఖ్య సలహాదారుడు ఆకుల ప్రసాద్ పటేల్, సహా అధ్యక్షులు జిలకర కిషన్ పటేల్, పెద్దోళ్ల నాగరాజు సలహాదారులు నేటి కుంట శేఖర్ పటేల్ ,చిట్టి నారాయణ రెడ్డి పటేల్, సుమారు. 300 మంది సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మున్నూరు కాపు ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

జంట మరణాలపై విచారణ చేపట్టాలి

ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఎనిమిదేళ్ల క్రితం జరిగిన తలారి సత్యం, చేపూర్ రవి జంట మరణాలపై ప్రభుత్వం ఉన్నతస్థాయి దర్యాప్తు చేయించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని తాజ్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం రాజకీయ పార్టీలు, దళిత ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో తలారి సత్యం యాదిలో ప్రజాస్వామిక స్ఫూర్తి సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జంట మరణాలపై అవగాహన ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులతో దర్యాప్తు చేయించి దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు పోరాడుతున్న ప్రజాసంఘాల స్ఫూర్తి అభినందనీయమన్నారు. సభలో నాయకులు దేగాం యాదాగౌడ్, ప్రభాకర్, దేవారాం తదితరులు పాల్గొన్నారు.

సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



నివాళి అర్పిస్తున్న అధికారులు, సిబ్బంది



గాలిలోకి తుపాకులు పేల్చుతున్న సిబ్బంది

మాక్లూర్: రైలు ప్రమాదంలో మృతి చెందిన ఎయిర్స్ ఫోర్స్ ఉద్యోగి రవిచంద్ర అంత్యక్రియలు మండలంలోని చిక్లి గ్రామంలో ఆదివారం జరిగాయి. ఎయిర్స్ ఫోర్స్ అధికారి చౌహాన్ రవిచంద్ర భౌతిక ఖాయంపై జాతీయ జెండా కప్పి సెల్యూట్ చేశారు. శ్మశాన వాటికలో గౌరవ వందనంగా సిబ్బంది గాలిలోకి మూడుసార్లు తుపాకులు పేల్చి నివాళి అర్పించారు. సర్పంచులు ప్రమీల, సంజీవ్ రావు, వేములపల్లి సుబ్బారావు, గ్రామస్తులు ఉన్నారు.

షబ్బీర్ అలీ నియామకంపై కాంగ్రెస్ శ్రేణుల హర్షం



రాజంపేటలో హర్షం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



బీబీపేటలో బాణాసంచా కాలుస్తూ..

రాజంపేట/బీబీపేట/కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ మంత్రి షబ్బీర్ అలీని ఎస్సీ ఎస్టీ ఓబీసీ, మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుగా నియమించడం పట్ల కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. బీబీపేటలో ఆయన అనుచరులు బాణ సంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



షబ్బీర్ అలీని సన్మానిస్తున్న కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షులు పాక జ్ఞానేశ్వరి

శ్రీరామ నామమే ఆయన నిత్య జపం

- అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠాపనతో సంతోషం వ్యక్తం చేస్తున్న స్వామీజీ



కృష్ణానంద స్వామీజీ

కామారెడ్డి అర్బన్: శ్రీరామ నామమే ఆయన నిత్యజపం.. అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన పట్ల కామారెడ్డి మండలం శాబ్దిపూర్‌కు చెందిన పరయోగి కృష్ణానందస్వామి శ్రీరామ కోటి జపలిఖిత ప్రచారకులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. విద్యుత్‌శాఖలో ఉద్యోగం చేసే కృష్ణానందస్వామి 1979లో విద్యుత్ ప్రమాదంతో శారీరకంగా బాగా క్షీణించిపోవడంతో అధ్యాత్మికభావనతో భగవద్గీత పారాయణం చేశారు. 1990లో జీయర్‌స్వామి ద్వారా సన్యాసం స్వీకరించి తాడ్వాయి శబరి మాత శిష్యుడిగా మారారు. 1996లో కామారెడ్డిలో విశ్వశాంతి మహా యజ్ఞం ప్రారంభించి 108 యజ్ఞాలు పూర్తి చేశారు. 2007 నుంచి శ్రీరామకోటి జపలిఖిత ప్రచారకులుగా, అఖిలాంధ్ర సాధు పరిషత్ కార్యవర్గసభ్యుడిగా, టీటీడీ ధర్మప్రచార పరిషత్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. శ్రీరామకోటి జపలిఖిత ప్రచారకులుగా రామకోటి రాయడానికి పుస్తకాలు ముద్రించారు. ఒక్కో పుస్తకంలో కోటి రామనామాలు రాయడానికి అనువుగా గళ్లను ఏర్పాటు చేసి అధ్యాత్మిక సమావేశాల్లో పంపిణీ చేస్తారు. ఇప్పటికి వేలాది పుస్తకాలు పంపిణీ చేసినట్లు కృష్ణానంద స్వామి తెలిపారు.

గాయపడిన నెమలికి వైద్యం



ఎల్లారెడ్డిరూరల్: అనారోగ్యానికి గురై ఎగరలేని స్థితిలో ఉన్న నెమలికి వైద్యం అందించినట్లు అటవీశాఖ రేంజ్ అధికారి ఓంకార్ ఆదివారం తెలిపారు. మండలంలోని శివానగర్ ప్రాంతంలో నెమలి ఎగరలేని స్థితిలో ఉన్నట్లు గుర్తించిన స్థానికులు తమకు సమాచారం అందించడంతో బీట్ ఆఫీసర్ సవిత బేస్ క్యాంపు సిబ్బందితో కలిసి నెమలిని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. వెటర్నరీ వైద్యురాలు అర్చన గాయపడిన నెమలికి వైద్యం చేశారు. నెమలికి రెండు రోజుల వైద్యం అవసరమని ఆ తర్వాత అడవిలో వదిలిపేడతామని ఆయన పేర్కొన్నారు.

నలుడి రథం..



నలుడి రథం వద్ద భిక్కనూరు వాసులు(ఫైల్)

భిక్కనూరు: అయోధ్యలో రామ మందిర నిర్మాణం కోసం 1992 సంవత్సరంలో శిలలు, ఇటుకలు సేకరించారు. సేకరించిన శిలలు, ఇటుకలను నలుడి రథంలో రామజన్మభూమికి తరలించారు. ఈ సందర్భంగా భిక్కనూరులోని శ్రీసిద్ధరామేశ్వర ఆలయం వద్ద నలుడి రథానికి భక్తులు మంగళ హారతులిచ్చారు. కార్యక్రమంలో మండలానికి చెందిన పి.శంకరప్ప, జేపీ సిద్ధా, డి.సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సదాశివనగర్: మండలంలోని కుప్రియాల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఒకరు మృతి చెందినట్లు ఎస్సై రాజు ఆదివారం తెలిపారు. మాక్లూర్ మండలం చిక్లి గ్రామానికి చెందిన కుంచపు శేఖర్(28) ఈ నెల 11న జాతీయ రహదారిపై రోడ్డు క్రాస్ చేస్తుండగా కంటైనర్ ఢీకొన్నది. ఈ ఘటనలో తలకు, కాళ్లకు తీవ్రగాయాలు కావడంతో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒకరి అదృశ్యం



నిజామాబాద్ రూరల్: నీలకంఠనగర్ ప్రాంతానికి చెందిన చిలుక అబ్బయ్య అదృశ్యమైనట్లు రూరల్ ఇన్‌చార్జి ఎస్సై రామారావు ఆదివారం తెలిపారు. శనివారం ఉదయం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని సాయిబాబా గుడికి వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లిన అబ్బయ్య తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు శైలేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లింగాపూర్‌లో చోరీ

రుద్రూర్: కోటగిరి మండలం లింగాపూర్‌లో తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై సందీప్ ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బయ్యగారి నవీన్ తన ఇంటికి తాళం వేసి వేరే ఊరికి వెళ్లాడు. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. మూడు మాసాల బంగారం , ఎనిమిది తులాల వెండి చోరీకి పాల్పడినట్లు బాధితుడు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మాక్లూర్: మండలంలోని కొత్తపల్లి శివారులో పేకాటస్థావరంపై దాడిచేసినట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్ ఆదివారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో వారి నుంచి రూ. 10,520 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా పేకాట ఆడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. శుక్రవారం నాటికి 2 లక్షల 51 వేల 48 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్థం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): చిన్న దేవిసింగ్ తండాలో డ్రైనేజీలలో చెత్త నిండిపోయి రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తున్నాయి. మరికొన్ని కాలనీలలోని డ్రైనేజీలలో పచ్చగడ్డి, చెత్తతో పూర్తిగా నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోందని, ఈ దుర్వాసనతో అనారోగ్య పాలవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీలు శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

గంజాయి స్వాధీనం



బాన్సువాడ: పట్టణంలోని గౌలి గూడలో గంజాయి ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మహేందర్ రెడ్డి ఆదివారం తెలిపారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు మండల కేంద్రానికి చెందిన షర్ఫొద్దీన్‌ను అదుపులోకి తీసుకొని 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంజాయిని ఎక్కడి నుంచి తీసుకొచ్చాడో విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.